క్లుప్తంగా

ప్రోత్సాహక నగదు అందజేత



దయానా, ధనుష్‌కు నగదు అందజేస్తున్న డీఈఓ శేఖర్

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి, అత్యధిక మార్కులు సాధించిన దయానా, ధనుష్‌కు గురువారం డీఈఓ శేఖర్, దాత రమణయ్యనాయుడు రూ.7 వేలు ప్రోత్సాహక నగదును అందజేశారు. కారాకొల్లు గ్రామానికి చెందిన రమణయ్యనాయుడు ఏటా పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ఒక్కొక్కరి రూ. 7 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు. ఈ సందర్భంగా డీఈఓ శేఖర్ మాట్లాడుతూ దయానా, ధనుష్‌లు ట్రిపుల్ ఐటీకి ఎంపికైయ్యారని, బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని తెలిపారు. రమణయ్యనాయుడు పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి



విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: మండలంలోని తొండమనాడు ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆ పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు సుజాత తన సొంత నిధులతో నగదు బహుమతిని అందజేశారు. అందులో 590 మార్కులు సాధించిన యోగేష్‌కు రూ.5,116, అలాగే 589 మార్కులు సాధించిన అభిలాష్‌కు 5,106, అలాగే 580 మార్కులు సాధించిన దేవికి రూ5,006 నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేశారు. నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు అచ్చుతయ్య, వైస్ చైర్‌పర్సన్ జైభున్నిసా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు శివారెడ్డి, ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్మశానాలు ఆక్రమణలకు గురి కాకుండా చూడండి



మాట్లాడుతున్న తహసీల్దార్ సుబ్రమణ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 పంచాయతీలతో శ్మశానాలు ఆక్రమణకు గురికాకుండా చూడాలని తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. ఆయన గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లోని శవాలను తీసుకెళ్లటానికి దారి సౌకర్యం లేని శ్మశానాలను గుర్తించాలని తెలిపారు. గ్రీవెన్స్‌డే రోజున నిర్వహించే ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమంలో వచ్చిన వినతులను విచారించి, పరిష్కరించాలన్నారు. భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంటి స్థలాలు లేని వారిని గుర్తించి, వారి పేరును నమోదు చేసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, మండల సర్వేయర్ వెంకట్రామయ్య పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయం పెంచుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

నారాయణవనం: పంచాయతీలు ప్రగతిని సాధిస్తూ ఆదాయ వనరులను పెంచుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌ల మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని గురువారం కమ్యూనిటీ భవనంలో ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పద్దుల కింద పంచాయతీలకు అందజేసే నిధులను, పన్నుల రూపంలో లభించే ప్రత్యక్ష ఆదాయాన్ని నిబంధల మేరకు మాత్రమే వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. పారిశుద్ధ్యానికి, రక్షిత తాగునీటికి తొలి ప్రాధాన్యత ఇస్తూ, మురుగు కాలువల శుభ్రం, చేతి పంపుల నిర్వహణపై శ్రద్ధ చూపాలన్నారు. ఈఓపీఆర్డీ డాక్టర్ వేనయ్య మాట్లాడుతూ పంచాయతీల్లో సంపదను పెంచుకునే మార్గాలను చూడాలన్నారు. షాపులకు లైసెన్సులు, హోర్డింగ్‌లపై, ఆస్తుల పన్నులను క్రమబద్ధీకరించి వందశాతం వసూలు చేయాలని సూచించారు.

శ్రీకాళహస్తి-వరదయ్యపాళెం రోడ్డులో గోవర్ధనపురం వద్ద వంతెనపై ఏర్పడిన గుంతలు



వరదయ్యపాళెం-పెద్ద పాండూరు రోడ్డులో నీటి మడుగును తలపిస్తున్న గుంతలు



బాటసారీ

అడుగుకో గొయ్యి.. గజానికో గుంత.. రోడ్డంతా తేలిన కంకర.. వెరసి రహదారులు రూపుమారిపోయాయి. పగటి పూట ప్రయాణమే నరకం.. రాత్రి వేళ పయనం ప్రాణాంతకమే. దినదిన గండం.. దారులకో దండం అంటున్నారు వాహన చోదకులు. పొరుగూరికి వెళ్లి రావాలంటే వళ్లంతా హూనం అవుతోందని ఆవేదన చెందుతున్నారు. మరమ్మతు చేయించాల్సిన అధికారులు మాత్రం బాట'సారీ' అంటున్నారు. ఇదీ వరదయ్యపాళెంలోని రహదారుల దుస్థితి.

ప్రయాణం..ప్రాణ సంకటం
- అధ్వానస్థితిలో గ్రామీణ రహదారులు రూపుకోల్పోయిన రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



కడూరు-సత్యవేడు ప్రధాన రోడ్డులోని యానాదివెట్టు వద్ద బావిని తలపిస్తున్న గుంత

వరదయ్యపాళెం: మండలంలోని పలు పల్లెలకు వెళ్లే అంతర్గత గ్రామీణ ఆర్‌అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు రోడ్లు రూపం కోల్పోయాయి. వరదయ్యపాళెం నుంచి పెద్ద పాండూరు, బత్తలవల్లం నుంచి కారిపాకం గ్రామానికి వెళ్లే రోడ్లంటే వాహనచోదకులు, ప్రయాణికులు హడలిపోతున్నారు. వరదయ్యపాళెం-సంతవేలూరు, బత్తలవల్లం-కారిపాకం, వరదయ్యపాళెం-పెద్ద పాండూరుకు వెళ్లే మార్గంలో రోడ్లకిరువైపులా చెట్ల పొదలు కమ్ముకున్నాయి. అనేకచోట్ల కంకర లేచిపోయి గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గాల్లో వాహనాలు నడపడం ఇబ్బందిగా ఉందని స్థానికులతోపాటు వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా ప్రధాన రోడ్లు

మండలంలో వరదయ్యపాళెం-తడ, కడూరు కూడలి-సత్యవేడు ప్రధాన రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. పలుచోట్ల రోడ్డుపై ఏర్పడిన గుంతలు రాకపోకలకు అంతరాయంగా మారుతున్నాయి. ఈ మార్గాల్లో అటు శ్రీసిటీ పరిధిలోని పరిశ్రమలకు ఇటు ఏపీఐఐసీ పరిధిలో ఉన్న అపోలో, హీరో పరిశ్రమలకు పెద్ద ఎత్తున వాహన రాకపోకలు జరుగుతున్నాయి. అయితే ఇంతటి ప్రాముఖ్యత కలిగిన రోడ్ల గురించి ఆర్ అండ్‌బీ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రెండు మార్గాల్లో అనేకచోట్ల గుంతలు ఏర్పడి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడడంతో పాటు ప్రమాదాలకు గురవుతున్నారు.

మరమ్మతులు అవసరం

మండలంలో పలు ఆర్‌అండ్‌బీ రోడ్లు దుస్థితిలో ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అతుకుల రోడ్లు వేసి కాలయాపన చేసే బదులు పూర్తిస్థాయిలో బీటీ రోడ్డు లేయర్‌ను మరోసారి వేస్తే అప్పుడప్పుడు రోడ్లకు మరమ్మతులు చేయాల్సిన పని ఉండదు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు గుర్తించాలి. శ్రీకాళహస్తి-వరదయ్యపాళెం ప్రధాన రోడ్డులోని గోవర్ధనపురం వద్ద పాముల కాలువపై ఏర్పాటు చేసిన లోలెవల్ కాజ్‌వేపై పూర్తిగా కాంక్రీట్ కొట్టుకుపోయింది. వాహన రాకపోకల రాపిడికి గుంతలమయమై గతంలో కాంక్రీట్ కోసం ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలు సైతం బయటకు వచ్చేశాయి. వరదయ్యపాళెం మండల కేంద్రంలో ఇంతటి దుర్భర పరిస్థితి ఉన్నా ప్రభుత్వ పెద్దలకు పట్టడం లేదు. ఇప్పటికైనా మేలుకోండి.

దుస్థితిలో సత్యవేడు-ఊత్తుకోట రోడ్డు

సత్యవేడు-ఊత్తుకోట ప్రధాన రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. 14 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డు బీటీ రెన్యూవల్ పనులు చేపట్టేందుకు గత ప్రభుత్వం రూ. 4.50కోట్లు నిధులు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యి కాంట్రాక్టర్ పనులను చేజిక్కించుకున్నాడు. అయితే పనులు ప్రారంభించలేదు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో అడుగడుగునా గుంతలు ఏర్పడి వాహనచోదకులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా కార్లలో వెళ్లేవారు గుంతలలో దించడంతో వాహనాలు పాడైపోతున్నాయని వాహన యజమానులు వాపోతున్నారు.

మండలంలో గ్రామీణ ఆర్‌అండ్‌బీ రోడ్లు

మార్గం	కిలోమీటర్లు
వరదయ్యపాళెం-పెద్ద పాండూరు-చిన్న పాండూరు వరకు	9
వరదయ్యపాళెం-సంతవేలూరు	12
సంతవేలూరు-సూళ్లూరుపేట వరకు	5
శ్రీసిటీ మీదుగా ఇరుగుళం-తిమ్మినాయుడుపేట	5
తడ-వరదయ్యపాళెం	14
కడూరు-చిన్న పాండూరు	8
సత్యవేడు-ఊత్తుకోట	14
స్టేట్ హైవే పరిధిలో	22

వాహనచోదకుల కష్టాల తీర్చండి



కడూరు కూడలి నుంచి సత్యవేడుకు వెళ్లే ప్రధాన రోడ్డు మార్గంలో ఏర్పడిన గుంతల్లో ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఈ మార్గంలో నిత్యం అనేక మంది కూటమి ప్రజాప్రతినిధులు, కీలక అధికార పార్టీ నాయకులు వెళుతుంటారు. అయినా వారి కంటికి ఈ గుంతల రోడ్డు కనిపించదు. ఎన్నికల ముందు అర్ధాంతరంగా ఆగిపోయిన పనులను తిరిగి పునరుద్ధించి పనులు పూర్తి చేసి వాహనచోదకుల కష్టాలను తీర్చాలి.

-చిన్నిరాజ్, సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి

ఇబ్బంది పడుతున్నాం



మండలంలోని బత్తలవల్లం నుంచి కారిపాకం రోడ్డులో ప్రయాణం చాలా కష్టంగా ఉంటోంది. నేను బత్తలవల్లం నుంచి సంతవేలూరు వరకు రోజూ ద్విచక్ర వాహనంపై వెళుతుంటాను. రోడ్డు పొడవునా గుంతలు ఉండడంతో వాహనంతో పాటు ఒళ్లు హూనం అవుతోంది. వాహనాలు కూడా పాడవుతున్నాయి.

-బాలకృష్ణ, సర్పంచ్, పులివల్లం

రోడ్లు బాగు చేయండి



వరదయ్యపాళెం నుంచి పెద్ద పాండూరు మీదుగా చిన్న పాండూరుకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలి. ప్యాచ్ వర్కులతో కాంట్రాక్టర్లకు లబ్ధి తప్ప రోడ్డు బాగు కావడం లేదు. 9 కిలోమీటర్ల మేరకు రోడ్డుకు నూతనంగా బీటీ లేయర్ వేయాలి.

-మధుబాబు, పెద్ద పాండూరు

ప్రభుత్వానికి నివేదించాం



రోడ్ల మరమ్మతులకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదించాం. అత్యవసరంగా మరమ్మతు చేపట్టాల్సిన రోడ్డు పనుల గురించి కూడా అధికారులకు విన్నవించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే మరమ్మతులు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

-రాంబాబు, డీఈ, శ్రీకాళహస్తి డివిజన్, ఆర్‌అండ్‌బీ

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి అభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

తహసీల్దార్‌తో ఎంపీడీఓ భేటీ



తహసీల్దార్‌ను అభినందిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

సత్యవేడు: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన టీవీ సుబ్రమణ్యంను ఎంపీడీఓ చంద్రశేఖర్ గురువారం రెవెన్యూ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాల వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. మండలాభివృద్ధికి సహకారం అందించాలని ఎంపీడీఓ కోరారు. సమస్యల పరిష్కారంలో తనవంతు కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శివయ్య, రవిచంద్ర పాల్గొన్నారు.

వినాయకసాగర్‌లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

తిరుపతి(అలిపిరి): వినాయకసాగర్‌లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును కోరారు. గురువారం కమిటీ సభ్యులతో ఆయన ఎమ్మెల్యేను కలిశారు. తిరుపతి ప్రజల కోరిక మేరకు వినాయకసాగర్ మధ్యలో 90 అడుగుల నాట్య గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

తిరుమల వీజీవో బాధ్యతల స్వీకరణ

తిరుమల : తిరుమల వీజీవోగా ఏ.సురేంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు వీజీవోగా పనిచేస్తున్న నందకిషోర్ తిరుపతి వీజీవోగా నియమితులయ్యారు. నూతన వీజీవో మాట్లాడుతూ శ్రీవారి సన్నిధిలో పనిచేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. దేశ, విదేశాల నుంచి స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన రక్షణ, రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

తిరుపతి సిటీ: తిరుపతి టాటా క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాలలో క్యాన్సర్‌పై రెండు రోజుల అవగాహన సదస్సు గురువారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సుధాకర్‌రెడ్డి, ఎస్వీసీసీఏఆర్ వైద్యులు డాక్టర్ పి.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆస్పత్రి వద్ద ఆకలి కేకలు

రోగులతో వచ్చే పేదలకు తప్పని పస్తులు

శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పేద రోగులతోపాటు వచ్చే సహాయకులకు ఆకలి కేకలు తప్పడంలేదు. ఆస్పత్రిలో ప్రజా అవసరాలు తమకేమి పట్టనట్లు పాలకులు, అధికారులు గాలికి వదిలేశారు. దీనిపై నిత్యం రోగులతో వచ్చే సహాయకులు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే లేరు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చొరవతో ఆలయం నుంచి రోగుల సహాయకులకు భోజనం అందజేసేందుకు ఆలయం తరపున పాలకమండలి సహకారంతో అప్పటి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రతి రోజు ఆలయం నుంచి ఆస్పత్రికి 150 మంది వరకు భోజనం తయారు చేసి పంపించే వారు. ప్రభుత్వాస్పత్రి ఊరికి దూరంగా ఉండడంతో రోగులు, బాలింతలతోపాటు వచ్చే సహాయకులకు భోజనం కావాలంటే కిలోమీటరు మేర నడచి రావాల్సిందే. అయితే కరోనా కష్టకాలంలో ఆలయం నుంచి భోజనం అందజేయడంతో చాలా వరకు రోగులు, వారిసహాయకులకు ఉపశమనం కలిగింది. రోగులకు ఇచ్చే ఆహారం పరిమితంగా ఇవ్వడంతో వారితో వచ్చే సహాయకులు అర్ధాకలిలో ఇబ్బంది పడేవారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి ఓపీ సమయంలో వరదయ్యపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, నాయుడుపేట, పెళ్లకూరు, ఏర్పేడు, కేవీబీపురం మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వస్తుంటారు. వారందరూ ఓపీ తీసుకుని వైద్యం చేయించుకునే సరికి మధ్యాహ్నం 2 గంటలు అవుతుంది. ఆలయం తరపున వచ్చే భోజనం తినేసి వెళ్లిపోయేవారు. అయితే ఎన్నికల నియమావళిలో భాగంగా ఆలయం నుంచి ఆస్పత్రికి భోజనం ఇవ్వకూడదని నిబంధన సాకుగా చూపి ఆపేశారు. అంతే కాకుండా ఆస్పత్రికి భోజనం తీసుకురావడానికి సుమారు రూ.200 లెక్కన నెలకు రూ.6వేలు అవుతుందని, అది చెల్లించడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతోనే ఆస్పత్రి నుంచి అది చెల్లించడానికి కుదరదని సూపరింటెండెంట్ విజయలక్ష్మి తెలిపారు. అయితే కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఆలయం తరపున డబ్బులు ఇవ్వడానికి ముందుకు వచ్చిన ఆస్పత్రిలో అన్నదానం పునరుద్ధరణ కాకపోవడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ ఆస్పత్రిని తనిఖీ చేసి, రోగులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పినప్పటికీ రోగుల సహాయకులకు భోజన పంపిణీ పునరుద్ధరణ కాకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీన్ని వెంటనే పునరుద్ధరించాని ప్రజాప్రతినిధులు, ప్రజలు, ప్రజాసంఘాలు వారు కోరుతున్నారు. ఆలయ అన్నదానం నుంచి ఆస్పత్రికి భోజనాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.



ఆస్పత్రిలో అన్నదానం ప్రారంభిస్తున్న పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు(ఫైల్)

రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకోవాలి

వరదయ్యపాళెం: రోడ్డు ప్రమాద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ డిమాండ్ చేశారు. భాకరాపేట ఘాట్ రోడ్డులో లారీ బోల్తా పడిన ఘటనలో గాయపడిన వరదయ్యపాళెం మండలం కళత్తూరుకు చెందిన బాధితులను వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పరామర్శించారు. లారీ బోల్తా ఘటనలో కళత్తూరు గ్రామానికి చెందిన నవీన్ మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం ఆయన రుయాలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, వారికి వైద్యం అందుతున్న తీరు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే మార్చురీలో ఉన్న నవీన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారీ కూలీలుగా వెళ్లి ప్రమాదానికి గురైన వారికి తక్షణమే ప్రభుత్వం ఆర్థికసాయం చేసి, ఆదుకోవాలని కోరారు. రోజూ కూలీకి వెళ్లితేగానీ కుటుంబం గడవని పరిస్థితుల్లో కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతోపాటు మరికొందరు గాయపడి ఉపాధికి వెళ్లలేనిస్థితిలో ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నందున వారిని తక్షణమే అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి ఉన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న నూకతోటి రాజేష్

ప్రశాంతంగా స్కూల్ కమిటీ ఎన్నికలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 51 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 5 జెడ్పీ ఉన్నత, ఒక గురుకుల పాఠశాలలకు గురువారం నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశారు. ఉదయం 7 గంటలకే పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులను ప్రతి తరగతి నుంచి బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీలకు చెందిన ముగ్గురు సభ్యులను ఎన్నుకున్నారు. తరగతుల వారీగా ఎన్నికైన మేనేజ్‌మెంట్ సభ్యులు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ చేతులెత్తి ఎన్నుకున్నారు. 62 పాఠశాలలో ఎక్కువ శాతం ఏకగ్రీవంగా చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకున్నారు. సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ కాలపరిమితి రెండేళ్లు ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటలకు కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మునిసుబ్రమణ్యం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను పర్యవేక్షించారు.

సత్యవేడులో ప్రశాంతం

సత్యవేడు: మండలంలోని 28 పంచాయతీల్లో ఉన్న 67 పాఠశాలల్లో పాఠశాల నిర్వాహక కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఇందులో అధికంగా ఏకగ్రీవం అయ్యాయి. మండలలో 50 ప్రాథమిక పాఠశాలలు, 11 ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్ఎంసీ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్లను ఎన్నుకున్నట్లు ఎంఈఓ రవి తెలిపారు.

6 పాఠశాలల్లో ఏకగ్రీవం

నారాయణవనం: మండలంలోని 46 ప్రభుత్వ పాఠశాల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 36 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఏకగ్రీవం అయ్యాయి. పది పాఠశాల్లో ఎన్నికలు అనివార్యం కావడంతో ప్రశాంత వాతావరణంలో కమిటీ సభ్యులు ఎన్నికయ్యారని ఎంఈఓ ప్రభాకర్‌రాజు తెలిపారు. అనంతరం కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారన్నారు. ఎంఈఓ ప్రభాకర్‌రాజు, తహసీల్దార్ జయరాములు, ఎంపీడీఓ కృష్ణమూర్తులు పర్యవేక్షకులుగా వ్యవహరించారు.



వరదయ్యపాళెం హైస్కూల్ ఎస్ఎంసీ కార్యవర్గం

మూడు పాఠశాలల్లో ఎన్నికలు

ఏర్పేడు: మండలంలోని మూడు పాఠశాలల్లో మినహా మిగిలిన అన్ని స్కూళ్లలో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఏర్పేడు మండలంలో 69 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 7 ఉన్నత పాఠశాలలు ఉండగా మునగలపాళెం హైస్కూల్, బండారుపల్లె, కృష్ణంపల్లె ప్రాథమిక పాఠశాలల్లో మాత్రమే ఎన్నికలు అనివార్యమయ్యాయి. మిగిలిన అన్ని పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎంఈఓ ప్రేమలత చెప్పారు. నూతన కమిటీతో ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు.

ఎస్ఎంసీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం

శ్రీకాళహస్తి రూరల్: మండలంలో గురువారం జరిగిన ఎస్ఎంసీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం అధికమైంది. దీంతో అనివార్యంగా అధిక శాతం ఎస్ఎంసీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఎన్నడూ లేని ఈ సంప్రదాయానికి టీడీపీ నాయకులు తెరతీశారు. తమకు అనుకూలమైన వారిని చైర్మన్‌గా నియమించుకోవాలన్న దురుద్దేశంతో స్థానిక టీడీపీ నాయకులు ఈ చర్యలకు పాల్పడ్డారు. శ్రీకాళహస్తి మండలంలోని 109 ప్రభుత్వ పాఠశాలల్లో టీడీపీ నాయకులు కూర్చొని తమకు అనుకూలమైన వారిని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. ఉపాధ్యాయులు అధికార పార్టీ నాయకులకు తలొగ్గడంతో చాలా పాఠశాలల్లో తూతూ మంత్రంగా ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి.



ఎల్లంపాడులో సమావేశం నుంచి వెళ్లిపోతున్న మహిళలు

వరదయ్యపాళెంలో ప్రశాంతం

వరదయ్యపాళెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 59 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు గురువారం జరిగాయి కొన్నిచోట్ల కూటమి నేతలు అత్యుత్సాహాన్ని ప్రదర్శించినప్పటికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు.

33 పాఠశాలల్లో ఏకగ్రీవం

నాగలాపురం: మండలంలోని 40 పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను నిర్వహించగా 33 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయని ఎంఈఓలు బాబయ్య, జనార్దన్‌రాజు తెలిపారు. అనంతరం వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు

నగర శుభ్రతే ధ్యేయం

- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- నగర కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా: నగర శుభ్రత, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అధికారులు, ఉద్యోగులు సమన్వయ కృషి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య పిలుపునిచ్చారు. ఆ దిశ అందరం ముందడుగు వేస్తే ప్రజలు మన వెంట నడుస్తారని, దీనిని దృష్టిలో ఉంచుకుని జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించాలని హితోపదేశం చేశారు. నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల అమెనిటీ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ, హెల్త్ సెక్రటరీలతో పాటు ఆయా విభాగాధిపతులతో గురువారం కచ్చపి ఆడిటోరియంలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల సెక్రటరీల పరిధి, చేయాల్సిన పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, అన్ని విభాగాల సెక్రటరీలు కలసి మెలసి పని చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ రోజూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు.

ఇంటింటికీ వాహనాలు వెళ్లి చెత్త సేకరించేలా శానిటరీ సెక్రటరీలు పర్యవేక్షించాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది నగరంలో ఎక్కడా భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాలని, అనధికారిక నిర్మాణాలు, ఫ్లెక్సీలు, హోర్డింగులు లేకుండా చూడాలని ఆదేశించారు. నగరంలో డ్రెయిన్లు, ప్రజలకు అవసరమైన రోడ్లు, గుంతలు లేకుండా చేయడం, నిర్దిష్ట సమయంలో ప్రతి ఒక్కరికీ నీరు అందేలా అమెనిటీ సెక్రటరీలు చూడాలని తెలిపారు. హెల్త్ క్లినిక్స్‌లో వైద్య సిబ్బంది అన్ని వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్ కుమార్, నరేంద్ర, మహేష్, శ్రావణి, రాజు, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాల సుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నగర కమిషనర్ మౌర్య